మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 17-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 79 Issue: 79

17 సెప్టెంబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:13 తిథి షష్ఠి ఉ. 10:49 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం అనురాధ రా. 7:48 వరకు తరువాత జ్యేష్ఠ యోగం విష్కంభ మ. 12:50 వరకు కరణం తైతుల ఉ. 10:49 వరకు గరజ రా. 11:53 వరకు వర్జ్యం రా. 2:09 నుండి తె. 3:56 వరకు దుర్ముహూర్తం ఉ. 10:09 నుండి ఉ. 10:58 వరకు మ. 2:59 నుండి మ. 3:48 వరకు రాహుకాలం మ. 1:41 నుండి మ. 3:11 వరకు యమగండం ఉ. 6:07 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:39 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 8:23 నుండి ఉ. 10:09 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:34 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## పీఎఫ్ వేతన పరిమితి రూ.25,000కు పెంపు

ఉద్యోగుల సామాజిక భద్రతను మరింత విస్తరించే కీలక నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పరిధిలో తప్పనిసరి పీఎఫ్ కవరేజీకి ఉన్న నెలవారీ వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచింది.

న్యూఢిల్లీ:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో అదనంగా 51 లక్షల మందికిపైగా ఉద్యోగులు ఈపీఎఫ్ఓ పరిధిలోకి తరువాయి 2 వ పేజీలో...

# 6 చిన్నారులు జల సమాధి

## గణేశ్ నిమజ్జనంలో అపశృతి.. సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం



గణేశ్ నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వెళ్లిన విద్యార్థులు ప్రమాదవశాత్తూ చెరువులో పడి దుర్మరణం చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న నేరెడు చెరువులో నిమజ్జనం సందర్భంగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పండుగ సందర్భంగా జరిగిన ఈ విషాదంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. పెద్దకంజర్ల గ్రామంలో వినాయక చవితి సందర్భంగా 3 రోజుల పాటు గణేశ్ ఉత్సవాలను నిర్వహించారు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): బుధవారం సాయంత్రం వినాయక విగ్రహ నిమజ్జనం కోసం స్థానికులతో పాటు విద్యార్థులు ఊరేగింపుగా నేరెడు చెరువు వద్దకు వెళ్లారు. విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేస్తున్న సమయంలో అనుకోని ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. నిమజ్జనం సమయంలో కొందరు విద్యార్థులు చెరువులోకి దిగగా.. నీటి లోతు, అడుగున ఉన్న -2 వ పేజీలో...



## ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలు బ్యాన్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): హైదరాబాద్ నగర పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి అధికారులు కీలక ప్రకటన చేశారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కఠిన ఆదేశాల నేపథ్యంలో హుస్సేన్ సాగర్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అనుమతి లేదని హైదరాబాద్ సిటీ పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తరువాయి 2 వ పేజీలో...



## డైవర్షన్..!

**కేసీఆర్ ఫాంహౌజ్ భూములు సరే..**

**మా సంగతేంటి?: 22ఏ బాధితులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణలో భూముల వ్యవహారం మరోసారి రాజకీయ వేడిని రాజేసింది. ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతల భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా పలు వివరాలు వెల్లడించారు. మరోవైపు వేలాది మంది సామాన్య ప్రజలు తమ ఆస్తులు 22ఏ తరువాయి 2 వ పేజీలో...

# కేసీఆర్ ఫ్యామిలీకి 439 ఎకరాలు



## ఫాంహౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి

**భూమిపై విచారణ.. అధికారులకు 30 రోజుల డెడ్‌లైన్.. అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్ భూములపై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తాజాగా తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ సభ్యులు, సమీప బంధువుల పేర్లపై ఉన్న భూముల వివరాలను సభ ముందు రేవంత్ రెడ్డి ఉంచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారంటూ రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలకు తెరతీశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు):ఈ క్రమంలోనే ఎర్రవల్లిలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్‌కు సంబంధించిన భూములపై సమగ్రంగా విచారణ జరిపి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు.. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని, ఆ వెంటనే విచారణ చేపట్టాలని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసీఆర్ ఫాంహౌస్ భూముల విచారణను మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షిస్తారని తరువాయి 2 వ పేజీలో...

# రేవంత్ ఫ్యామిలీకి 308 ఎకరాలు



## వాటి చుట్టే ట్రిపుల్ ఆర్, బుల్లెట్ రైలు అలైన్‌మెంట్లు

**దీనిపై మా దగ్గర పక్కా ఆధారాలున్నాయ్.. సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**

**మూడేళ్లలో రేవంత్ వెనకేసిన ఆస్తుల లెక్క తేల్చాలి.. నా ఆస్తులపైనా విచారణకు సిద్ధమే: హరీశ్‌రావు**

సీఎంరేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యుల పేరున ఏకంగా 308 ఎకరాల భూములున్నాయని.. దీనికి సంబంధించి తమవద్ద పక్కా ఆధారాలున్నాయని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ భూముల సమీపం నుంచే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్, అలాగే బుల్లెట్ ట్రెయిన్ అలైన్‌మెంట్ వెళ్లేలా ప్లాన్లు రూపొందించుకున్నారని హరీశ్‌రావు అన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): 'నిజంగా రేవంత్‌రెడ్డికి నైతికత ఉంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఈ మూడేళ్లలో ఆయన సంపాదించిన ఆస్తులతోపాటు, మా ఆస్తులు.. ధరణి–భూభారతిలో జరిగిన వ్యవహారాల మీద సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?" అని సవాల్ విసిరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,344 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,525 |

# ఎండీఆర్‌తో బ్యాంకులకు రూ.20,00 కోట్ల ఆదాయం!

## అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూపీఐ లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలని ప్రతిపాదించింది. ఈ నిర్ణయంతో బ్యాంకులకు, డిజిటల్ పేమెంట్ సంస్థలకు ఏటా రూ.20,000 కోట్ల వరకు భారీ ఆదాయం సమకూరవచ్చని పలు అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.




న్యూఢిల్లీ: ఎన్‌పీసీఐ మంగళవారం జారీ చేసిన ఆదేశాల ప్రకారం, అక్టోబర్ 15 నుంచి రూ.2,000 దాటిన పర్సన్-టు-మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వసూలు చేస్తారు. అయితే, ఈ భారం వినియోగదారులపై ఏమాత్రం ఉండదు. వ్యాపారులే ఈ రుసుమును చెల్లించాల్సి తరువాయి 2 వ పేజీలో...




## ర్యాపిడోకు రూ.10 లక్షల ఫైన్

**రైడ్‌కు ముందే టిప్ చట్టవిరుద్ధం: సీసీపీఏ**

న్యూఢిల్లీ: ప్రముఖ రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫారమ్ ర్యాపిడోకు చెందిన రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) రూ.10 లక్షల జరిమానా విధించింది. ర్యాపిడో కస్టమర్స్‌కు తప్పుదోవ పట్టించే ప్రకటనలు, చట్టవిరుద్ధమైన వ్యాపార పద్ధతులు, ర్యాపిడో యాప్‌లో 'డార్క్ ప్యాటర్న్స్' ఉపయోగించి కస్టమర్ల నుండి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నందనే ఆరోపణల నేపథ్యంలో సీసీపీఏ ఈ చర్యలు తీసుకుంది. క్యాబ్ , బైక్-టాక్సీ అగ్రిగేటర్ ర్యాపిడోపై జరిపిన విస్తృత సమీక్ష నేపథ్యంలో నియంత్రణ సంస్థ సీసీపీఏ ఈ చర్యలు తీసుకుంది. కస్టమర్స్ ముందుగా టిప్ ఇవ్వడం, తరువాయి 2 వ పేజీలో...



## 13 రోజులు దసరా సెలవులు

తెలంగాణలో దసరా సెలవులపై విద్యాశాఖ సమాచారం ఇచ్చింది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను కూడా తాజాగా ప్రకటించింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనుండగా.. ఆ తర్వాత అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉండనున్నాయి. అంటే తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



అవసరం లేని శరీర బరువులో 5-10 శాతం తగ్గితే గుండె జబ్బులు, టైప్-2 మధుమేహం, అధిక రక్తపోటు ముప్పు తగ్గుతుంది. ముఖ్యంగా నడుము చుట్టూ పేరుకునే కొవ్వు గుండె ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. బరువు తగ్గడం వల్ల గుండెపై భారం, రక్తపోటు, హానికర కొవ్వులు, దీర్ఘకాలిక వాపు తగ్గడంతోపాటు ఇన్సులిన్ పనితీరు మెరుగుపడుతుంది. బరువు తగ్గే సమయంలో కండరాలను కాపాడుకోవడానికి తగినంత ప్రోటీన్ తీసుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం. త్వరిత బరువు తగ్గింపుకంటే దీర్ఘకాలిక ఆరోగ్యకర అలవాట్లే గుండెకు మేలు చేస్తాయి.



## రూ.11 ఉత్పత్తిపై రూ.325 వసూలు

**ఆసుపత్రి బిల్లులపై తుకారాం ముండే సంచలన విషయాలు**

ముంబై: తన దూకుడు నిర్ణయాలతో వార్తల్లో నిలిచిన మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారాం ముండే.. ఆసుపత్రుల్లో రోగుల నుంచి వసూలు చేస్తున్న ధరలపై సంచలన విషయాలను బయటపెట్టారు. రూ.11కే కొనుగోలు చేసిన ఐవీ ఇన్ఫ్యూషన్ సెట్‌ను ఏకంగా రూ.325కు విక్రయిస్తున్నారని వెల్లడించారు. అంటే కొనుగోలు ధరతో పోలిస్తే దాదాపు 2,841 తరువాయి 2 వ పేజీలో...

# గ్రేటర్ ఇన్ డేంజర్

**హైదరాబాద్‌లో భారీగా పడిపోతున్న భూగర్భ జలాలు**

**గతేడాదితో పోలిస్తే సగటున 5 మీటర్ల మేర తగ్గిన నీటిమట్టం**

**22 శాతం వర్షపాతం లోటు, పెరిగిన వినియోగమే ప్రధాన కారణం**

**కుత్బుల్లాపూర్‌లో ఏకంగా 39 మీటర్లకు పడిపోయిన నీటిమట్టాలు**



వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి.

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం తరువాయి 2 వ పేజీలో...



## 10 మంది నక్సల్స్‌కు మరణ శిక్ష

**ఎన్ఐఏ కోర్టు సంచలన తీర్పు**

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో సంచలనం సృష్టించిన ఝీరాం ఘాటీ మారణకాండ కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు 10 మంది మావోయిస్టులకు మరణ శిక్ష విధించింది. ఈ కేసులోని నిందితులందరికీ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

17.9.2026

మేషం: ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. వ్యాపారాల విస్తరణలో అవాంతరాలు తప్పవు. ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా వేస్తారు. ధనపరంగా ఇబ్బందులు తప్పవు. ఉద్యోగమున మార్పులు ఉంటాయి. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృషభం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆత్మీయులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

మిధునం: ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. చేపట్టిన పనులు కొన్ని వాయిదా వేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వృత్తి ఉద్యోగాలు సమస్యాత్మకంగా ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. బంధుమిత్రులతో అకారణ వివాదాలు ఉంటాయి.

కర్కాటకం: సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

సింహం: వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. కొన్ని విషయాలలో ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

కన్య: ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహ పరుస్తాయి. దైవచింతన పెరుగుతుంది. గృహ నిర్మాణ ఆలోచనలు నిలకడగా ఉండవు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి విభేదాలు తప్పవు.

తుల: ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. నిరుద్యోగులకు శ్రమ తప్ప ఫలితం ఉండదు. వృత్తి వ్యాపారాలలో శ్రమ పెరుగుతుంది. బంధుమిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి.

వృశ్చికం: ఆస్తి వివాదాలు తొలగుతాయి. మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కీలక సమయంలో ఆత్మీయుల సలహాలు స్వీకరిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి.

ధనస్సు: ప్రముఖులతో సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభిస్తాయి. సన్నిహితుల నుంచి అవసరానికి ధన సహాయం అందుతుంది. ఉద్యోగాలలో నూతన అవకాశాలు లభిస్తాయి. కొత్త వ్యక్తుల పరిచయాలు సంతోషాన్నిస్తాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

మకరం: చిన్నపాటి అనారోగ్యాలు తప్పవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నూతన ఋణయత్నాలు సాగిస్తారు. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

కుంభం: కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపార, ఉద్యోగాలు మందకోడిగా సాగుతాయి. ముఖ్యమైన పనులు కొన్ని మధ్యలో విరమిస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

మీనం: ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. సంఘంలో విశేషమైన ఆదరణ పెరుగుతుంది. ఉద్యోగాలలో సమస్యలు తీరతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. స్థిరాస్తి వివాదాలలో బయటపడటానికి ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది.

# రేవంత్ ఫ్యామిలీకి308 ఎకరాలు

మొదటి పేజీ తరువాయి

మీడియాతోమాట్లాడారు. తనపై, తన ఆస్తులపై సీఎం చేసిన అసత్య ఆరోపణలను హరీశ్‌రావు ఈ సందర్భంగా తిప్పికొట్టారు. రేవంత్‌రెడ్డి, ఆయన కూతురు, తమ్ముళ్ల పేరుతో 308 ఎకరాల భూములు ఉన్నాయని చెప్పారు. ఒక్క కొట్రా గ్రామంలోనే 300 ఎకరాలు ఉన్నాయని రైతులు చెబుతుండగా.. అందులో 175 ఎకరాలకు సంబంధించి డాక్యుమెంట్లు తమ దగ్గర ఉన్నాయని ప్రకటించారు. దానికి తోడు కొండారెడ్డిపల్లిలో 77ఎకరాలు, అఫిడవిట్‌లో ప్రకటించిన మరో 54ఎకరాలు.. మొత్తం 308ఎకరాలపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. 'నాదర్‌గుల్‌లో రూ.10వేల కోట్ల విలువైన భూకుంభకోణాన్ని సాక్ష్యాధారాలతో బయటపెడితే ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం లేదన్నారు. సీఎం సోదరుడికి చెందిన టెస్సరాక్ట్ కంపెనీకి కోట్ల విలువైన భూముల కేటాయింపు, పసుమాములలో మరో సోదరుడి భూమి నాలా కన్వర్షన్‌పై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. భూభారతిలో 9200కు పైగా భూముల రిజిస్ట్రేషన్లు యజమానులు తెలియకుండానే జరిగిపోయాయన్నారు. గజ్వేల్‌లో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళ భూమి ఆమెకు తెలియకుండానే బదిలీ అయిందన్నారు. పొరపాట్లను సరిదిద్దాల్సిందిపోయి, భూభారతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు పాల్పడుతోందని హరీశ్ ఆరోపించారు. సీఎం ఇల్లు రాత్రికి రాత్రి 22ఏ జాబితా నుంచి ఎలా తొలగించారో.. అదేవిధంగా ప్రజల ఆస్తులను కూడా 22ఏనుంచి తొలగించాలన్నారు. "కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని మంత్రి పొంగులేటి అంటుంటే.. అధికారులే 30లక్షల ఎకరాలను పొరపాటుగా అప్‌లోడ్ చేశారని సీఎం చెబుతున్నారు. ఇందులో ఎవరు చెప్పేది నిజం"అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఎన్ని భూములు నిషేధిత జాబితాలో పెట్టారు? ఎన్నింటిని జాబితా నుంచి తొలగించారన్న దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. తాము సభలోఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలు, సీఎం కుటుంబ అవినీతి బయటపడుతుందన్న భయంతోనే మొత్తం సెషన్ నుంచి సస్పెండ్ చేశారని హరీశ్ ఆరోపించారు.

# కేసీఆర్ ఫ్యామిలీకి 439 ఎకరాలు

మొదటి పేజీ తరువాయి

సీఎం తేల్చి చెప్పారు. కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 340 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి సభలో పేర్కొన్నారు. అయితే ఈ భూమి నిజంగా ప్రభుత్వ భూమేనని అధికారుల విచారణలో తేలిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆ భూమిని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఇదే సమయంలో కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ భూముల విషయంలో అగ్రికల్చర్ సీలింగ్ యాక్ట్ నిబంధనలను ప్రస్తావిస్తూ.. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాల్సి ఉంటుందని వివరించారు. భూమి రకాన్ని బట్టి కుటుంబానికి నిర్ణీత పరిమితి ఉంటుందని చెప్పారు. సిద్దిపేట ప్రాంతంలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు.. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు.. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు.. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు.. జోగినిపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ రెడ్డి సభకు వివరించారు. అదే సమయంలో నవీన్‌రావు పేరుతో 52 ఎకరాలు.. కొండల్‌రావు పేరుతో 48 ఎకరాలు ఉన్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం మీద కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణలోని 9 జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో సుమారు 439 ఎకరాల భూముల వివరాలు ఉన్నాయని సీఎం సభావేదికగా వెల్లడించారు. కేసీఆర్ పేరుతో 60 ఎకరాలకు పైగా భూమి ఉందని.. కేటీఆర్ పేరుతో 49.4 ఎకరాలు.. శైలిమ పేరుతో 15 ఎకరాలు.. అలేఖ్య పేరుతో 19.3 ఎకరాలు ఉన్నట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హిమాన్షు రావు పేరుతో కూడా భూములు ఉన్నాయని సభలో తెలిపారు. అదేవిధంగా హరీశ్‌రావు పేరుతో 20 ఎకరాలు, ఆయన సతీమణి పేరుతో 8 ఎకరాలు, కవిత పేరుతో 44 ఎకరాలు, ఆమె భర్త అనిల్ కుమార్ పేరుతో 23 ఎకరాలు ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. జోగినిపల్లి సంతోష్ కుటుంబానికి సంబంధం చిన భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. సంతోష్ కుమార్ పేరుతో 18.1 ఎకరాలు, ఆయన భార్య రోహిత్ పేరుతో 20.23 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ప్రస్తావించారు. సమ్మక్క, కొమురం భీమ్‌తో పాటు సాయుధ పోరాటం చేసిన కమ్యూనిస్టు ఉద్యమకారులు, ప్రజల హక్కుల కోసం పోరాడిన అనేక మంది ఆస్తులను కోల్పోయారని పేర్కొన్నారు. ఉద్యమకారుల కుటుంబాలు కూడా నష్టపోయాయని అన్నారు.

## 13 రోజులు దసరా సెలవులు

మొదటి పేజీ తరువాయి

ఈసారి దసరా పండగకు వరుసగా 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు రానున్నాయి. తెలంగాణలోని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా తరగతుల వారీగా వేర్వేరు సమయాలను విద్యాశాఖ కేటాయించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. 6, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. తరగతుల వారీగా ఏ రోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష నిర్వహించనున్నారనే పూర్తి టైమ్‌టేబుల్‌ను విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా తెలుసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

సెలవులు ఇలా..

అక్టోబర్ 10: దసరా సెలవులు ప్రారంభం
అక్టోబర్ 11: బతుకమ్మ ప్రారంభం
అక్టోబర్ 19: సద్దుల బతుకమ్మ
అక్టోబర్ 20: విజయదశమి
అక్టోబర్ 22: దసరా సెలవులకు చివరి రోజు
అక్టోబర్ 23: పాఠశాలలు తిరిగి ప్రారంభం

## రూ.25,000కు పెంపు

మొదటి పేజీ తరువాయి

రానున్నారు. ప్రస్తుతం నెలకు రూ.15 వేలకుపైగా వేతనంతో కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి ఈపీఎఫ్ పరిధిలో తప్పనిసరి కవరేజీ ఆటోమేటిక్‌గా ఉండదు. దీంతో పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణకు వారు దూరంగా ఉండే అవకాశం ఉంది. తాజా నిర్ణయంతో రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం పొందే ఉద్యోగులు తప్పనిసరి సామాజిక భద్రత పరిధిలోకి వస్తారు. కొత్త పరిమితి వల్ల ఉద్యోగులకు పీఎఫ్ పొదుపుతో పాటు ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద పెన్షన్ రక్షణ లభిస్తుంది. ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం (ఈడీఎల్ఐ) కింద బీమా రక్షణ కూడా అందుతుంది. ఇవన్నీ సంబంధిత పథకాల నిబంధనలకు లోబడి ఉంటాయి. ఈ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వానికి ఏటా రూ.11,339 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ప్రస్తుతం అందిస్తున్న వార్షిక బడ్జెట్ సాయం సుమారు రూ.10,250 కోట్లు. ఐదేళ్లలో మొత్తం వ్యయం దాదాపు రూ.56,696 కోట్లుగా ఉంటుందని కేంద్రం తెలిపింది. ఈ ప్రతిపాదనపై వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సంప్రదింపులు జరిగాయి. జూన్ 16న జరిగిన వ్యయ ఆర్థిక కమిటీ సమావేశంలోనూ దీనికి సంబంధించి ప్రతిపాదన వచ్చింది.

## రూ.325 వసూలు

మొదటి పేజీ తరువాయి

శాతం అధికంగా ఎంఆర్‌పీ పెడుతున్నారని తెలిపారు. మహారాష్ట్రలో ఆసుపత్రుల్లో వినియోగించే పలు ఉత్పత్తులపై నిర్వహించిన సర్వే వివరాలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. వాటి కొనుగోలు ధరకు, ముద్రించిన గరిష్ఠ చిల్లర ధరకు (ఎంఆర్‌పీ) మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు తెలిపారు. సర్వే ప్రకారం.. రూ.11.05కు కొనుగోలు చేసిన ఐవీ ఇన్ఫ్యూషన్ సెట్‌పై రూ.325 ఎంఆర్‌పీ ఉంది. అంటే ఏకంగా 2,841 శాతం మార్జిన్ నమోదైంది. రూ.6.75కు కొనుగోలు చేసిన సిరంజీపై రూ.57.20 ఎంఆర్‌పీ ఉంది. రూ.29.41కు తెచ్చిన కాథెటర్‌కు రూ.310 ఎంఆర్‌పీ ముద్రించారు. చికిత్స కోసం తప్పనిసరిగా ఉపయోగించే ఉత్పత్తుల విషయంలో రోగులకు ధరలను పోల్చుకునే అవకాశం ఉండదని ముందే అన్నారు. ప్రత్యామ్నాయాలు వెతకడం లేదా ధరను ప్రశ్నించడం కూడా వారికి సాధ్యం కాదని పేర్కొన్నారు. తయారీదారులు, పంపిణీదారుల స్థాయిలో ఎంఆర్‌పీ నిర్ణయమవుతుందని.. అది వాస్తవ కొనుగోలు ధరకు దూరంగా ఉండొచ్చని తెలిపారు.

# డైవర్షన్..!

మొదటి పేజీ తరువాయి

నిషేధిత జాబితాలోకి వెళ్లిపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పష్టమైన పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో ఇప్పుడు ప్రధాన ప్రశ్న ఒక్కటే..కేసీఆర్ కుటుంబ భూములపై విచారణకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో.. అదే స్థాయిలో 22ఏలో చిక్కుకున్న సామాన్యుల ఆస్తుల సమస్యకు ఎప్పుడు శాశ్వత పరిష్కారం లభిస్తుంది? సెప్టెంబర్ 16న అసెంబ్లీలో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ కుటుంబానికి చెందిన భూములపై పలు వివరాలను వెల్లడించారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబాలు, హరీశ్‌రావు కుటుంబం, సంతోష్‌రావు కుటుంబం తదితరులకు ఉన్న భూముల విస్తీర్ణాన్ని సభలో ప్రస్తావించారు. మొత్తం దాదాపు 440 ఎకరాల మేర భూములు ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొన్న వివరాల్లో ఉందని పలు నివేదికలు వెల్లడించాయి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టుపక్కల భూములపై కూడా విచారణకు సీఎం ఆదేశించారు. అక్కడ ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేలితే స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని ఆయన ప్రకటించారు. విచారణ నివేదికను 30 రోజుల్లో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే, 22ఏ సమస్య మాత్రం సామాన్యుల రోజువారీ జీవితాన్ని నేరుగా ప్రభావితం చేస్తోంది. భూమి తమదేనని పత్రాలు ఉన్నప్పటికీ.. నిషేధిత జాబితాలో పేరు ఉండటంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోవడం, ఆస్తి విక్రయించుకోలేకపోవడం, బ్యాంకు రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారని వివిధ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూములు.. తాము చట్టబద్ధంగా కొనుగోలు చేసిన స్థలాలు.. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తులు.. ఒక్కసారిగా 22ఏ జాబితాలోకి ఎలా వచ్చాయి? ఎవరు చేర్చారు? ఏ ఆధారాలతో చేర్చారు? తప్పుగా చేర్చినట్లయితే బాధ్యత ఎవరిది? సరిచేయడానికి ఎంత సమయం పడుతుంది? ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోలేక నష్టపోయిన వారికి పరిహారం ఉంటుందా? అధికారుల తప్పిదం వల్ల ఆస్తి విలువ తగ్గితే బాధ్యత ఎవరు తీసుకుంటారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు కావాలని బాధితులు కోరుతున్నారు.

## ర్యాపిడోకు రూ.10 లక్షల ఫైన్

మొదటి పేజీ తరువాయి

డైనమిక్ ప్రైసింగ్ వంటి మెథడ్స్‌పై ఈ విచారణ ప్రధానంగా జరిగింది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రెస్ రిలీజ్ ప్రకారం, రాపిడో వినియోగదారులకు డిస్‌ప్లే చేయబడిన కొన్ని సూచనలు, వారి రైడ్ వెరిఫై చేయకముందే వారి చేసే పేమెంట్స్ మొత్తాన్ని పెంచే విధంగా ప్రభావితం చేయగలవని గుర్తించింది. ర్యాపిడో కస్టమర్స్ వారు రైడ్ బుక్ చేసుకునే సమయంలో అదనపు పేమెంట్స్ డిస్‌ప్లే చేయబడిందని రెగ్యులేటరీ సంస్థ గుర్తించింది. విచారణలో భాగంగా ర్యాపిడో యాప్‌లో ఎక్కువ ధరలు ఉంటే ఎక్కువ రైడ్స్ పొందే ఛాన్స్, రూ.60కు కెప్టెన్స్ రైడ్ యాక్సెప్ట్ చేయడం లేదు, ప్లస్ 10, ప్లస్ 20, ప్లస్ 30 అదనంగా ఇవ్వండి " వంటి మెసేజెస్ బుకింగ్ ప్రాసెసింగ్‌లో ఉన్న సమయంలో కస్టమర్స్‌కు కనిపిస్తాయని విచారణలో గుర్తించింది. ర్యాపిడో ప్లాట్‌ఫారమ్ ప్రారంభంలో సరైన ధరలే కస్టమర్స్‌కు చూపించినప్పటికీ, ఆ తర్వాత డ్రైవర్స్ రైడ్ యాక్సెప్ట్ చేయడం లేదని కారణంతో ఆ ధరలను పెంచుతుందని గుర్తించింది. సీసీపీఏ ప్రకారం, ఈ రకమైన సందేశాలు కస్టమర్స్ ఎక్కువ ధర పెట్టేలా ప్రోత్సాహిస్తాయని, వారి రైడ్ బుక్ చేసుకునేందుకు ఎక్కువ డబ్బులు చెల్లించేలా చేస్తుంది.

## గ్రేటర్ ఇన్ డేంజర్

మొదటి పేజీ తరువాయి

కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## 6 చిన్నారులు జల సమాధి

మొదటి పేజీ తరువాయి

గుంతలను అంచనా వేయలేక వారు ప్రమాదవశాత్తూ లోతైన ప్రాంతంలోకి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఒకరిని మరొకరు రక్షించుకునే ప్రయత్నంలో పలువురు నీటిలో మునిగిపోయినట్లు సమాచారం. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే రక్షించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చెరువులో నుంచి విద్యార్థులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ విద్యార్థులు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో పెద్దకంజర్ల గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతులను నరసింహ (21), తేజ (17), సిద్ధార్థ్ (17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు. వీరంతా పటాన్‌చెరు ప్రాంతంలోని శిరీష చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులుగా ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు చెరువు వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లోనూ విషాదం నెలకొంది. పండుగ సందర్భంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన విద్యార్థులు ఇలా ప్రాణాలు కోల్పోవడంతో తోటి విద్యార్థులు, నిర్వాహకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం ఎలా జరిగింది.. నిమజ్జనం సమయంలో విద్యార్థులు చెరువులోకి ఏ పరిస్థితుల్లో వెళ్లారు.. అక్కడ భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. చెరువులో నీటి లోతు, గుంతలు వంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలు బ్యాన్

మొదటి పేజీ తరువాయి

హుస్సేన్‌సాగర్‌ను కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి విగ్రహాల నిమజ్జనానికి తావులేదని అధికారులు తేల్చిచెప్పారు. ఉత్సవ కమిటీలు, పూజా సంఘాలు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలను నిషేధించినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక బేబీ పాండ్స్, క్రేన్లు, కృత్రిమ నిమజ్జన కొలనులను ఏర్పాటు చేశారు. ఒకవేళ నిబంధనలను ఉల్లంఘించి ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీసులు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ సూచనల మేరకు పండగను జరుపుకోవాలని కోరారు.

# 10 మంది నక్సల్స్‌కు మరణ శిక్ష

మొదటి పేజీ తరువాయి

మరణశిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ సింగ్ రాజ్‌పుట్ బుధవారం తీర్పు చెప్పారు. నిందితులు ప్రస్తుతం జగదల్‌పూర్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. 2013 మే 25న ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న పరివర్తన్ యాత్ర వాహనాల కాన్వాయ్ పై సీపీఐ (మావోయిస్టు) సాయుధ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేయగా, 30 మంది మరణించారు. వారిలో 10 మంది పోలీసులు ఉన్నారు. 38 మంది గాయపడ్డారు. మృతుల్లో గిరిజన నేత మహేంద్ర కర్మ, అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నంద్ కుమార్ పటేల్, కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా కూడా ఉన్నారు.

## ఎండీఆర్‌తో బ్యాంకులకు రూ.20,00 కోట్ల ఆదాయం!

మొదటి పేజీ తరువాయి

ఉంటుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు ఈ రుసుము గరిష్ఠంగా రూ.300గా పరిమితం చేశారు. ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా ప్రకారం, ఈ కొత్త విధానం ద్వారా ఏటా రూ.20,600 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో సగం లావాదేవీలపై పూర్తిస్థాయిలో 0.4% ఎండీఆర్ వర్తించవచ్చని ఆ సంస్థ విశ్లేషించింది. మరో సంస్థ మోర్గాన్ స్టాన్లీ, ఈ నిర్ణయం పేమెంట్ రంగంలోని సంస్థల ఆదాయంపై పెను ప్రభావం చూపుతుందని పేర్కొంది. దీనివల్ల కొన్ని డిజిటల్ పేమెంట్ ప్రొవైడర్ల ఎబిటా 2028-29 ఆర్థిక సంవత్సరానికి 38 నుంచి 48 శాతం వరకు పెరగవచ్చని అంచనా వేసింది. యూబీఎస్ సంస్థ అంచనా ప్రకారం, ఈ ఆదాయం ఏటా రూ.10,000 నుంచి రూ.15,000 కోట్ల మధ్య ఉండొచ్చని, ఇందులో 60-70 శాతం బ్యాంకులకు, మిగిలింది డిజిటల్ పేమెంట్ సంస్థలకు వెళ్తుందని తెలిపింది. జేపీ మోర్గాన్, సిటీ వంటి సంస్థలు కూడా సుమారుగా రూ.16,000 కోట్ల నుంచి రూ.17,000 కోట్ల వరకు ఆదాయం రావచ్చని విశ్లేషించాయి.

# 22ఏ సమస్యలో 12 అంశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు.

పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు.




## వైసీపీ నుంచి మోపిదేవి సస్పెండ్

బాపట్ల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): ఏపీలోని రేపల్లె నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మోపిదేవి శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసీపీ అధినేత జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఐదు నెలల క్రితమే (గత మే నెలలో) శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీని వీడి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అత్యల్ప కాలంలోనే సస్పెన్షన్ వేటు పడటం బాపట్ల జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేసి శ్రీనివాసరావు ఓటమిపాలయ్యారు. అయితే, వైసీపీలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక వైసీపీలో సమాంతర గ్రూపు రాజకీయాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకే ఖరారైందంటూ నియోజకవర్గంలో ప్రచారం చేసుకోవడంపై స్థానిక కేడర్ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. మరొకవైపు వర్గపోరు ప్రోత్సహించే నేతలను ఉపేక్షించకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## 'ఓటుకు నోటు" ఏసీబీ పరిధిలోనిదే..!



న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## బీసీ రిజర్వేషన్లపై తీర్పు రిజర్వ్
## ఏపీ హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ




అమరావతి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణను ముగించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంపై తన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రభుత్వ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల 1065, 105 జీవోలను జారీ చేసింది. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మొత్తం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన 50 శాతం పరిమితిని దాటుతున్నాయని, ఈ జీవోలను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా జీవోలను సవరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

# రేషన్ ద్వారా 60 సరుకులు: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారం కాకుండా చూడాలని, ధరలకు కళ్లెం వేయడం ద్వారానే ద్రవ్యోల్బణాన్ని నియంత్రించగలమని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పంటల ఉత్పత్తి, సరఫరా, మార్కెట్ నిర్వహణపై ముందస్తు అంచనాలతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ద్రవ్యోల్బణం పెరగడానికి గల కారణాలను విశ్లేషించాలని, ఉత్పత్తికి, డిమాండ్‌కు మధ్య వ్యత్యాసం, సరఫరాలో లోపాలు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ (ప్రభుత్వ జోక్యం) చాలా అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏయే పంటలకు, ఏయే ప్రాంతాల్లో మార్కెట్ జోక్యం అవసరమో గుర్తించి, ధరలు పెరగకుండా చూడాలన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయడంతో పాటు, ఆయా పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అవసరమైతే రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేసేందుకు బై-బ్యాక్ ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. "ముందుగా అంచనా (ప్రెడిక్షన్) వేశాకే ఉత్పత్తికి (ప్రొడక్షన్) వెళ్లాలి. ఆ మేరకు మార్కెట్‌ను కూడా అంచనా వేసుకోవాలి" అని సీఎం స్పష్టం చేశారు. ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్, రైతు బజార్లు, రేషన్ డిపోల వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ధరలను అదుపులో ఉంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా దాదాపు 60 రకాల నిత్యావసర సరుకులను ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తక్షణమే ఉల్లి, కందిపప్పు వంటివి అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.



# హరీశ్‌కు రిజిస్ట్రేషన్ ఎలా?

**అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై పొంగులేటి నిలదీత**

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.



# ఏపీ తీరం దిశగా అల్పపీడనం ఉత్తరాంధ్రకు వర్ష సూచన

వైజాగ్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.



## యూపీఐ చార్జీలు మంచికే: పేటీఎం

న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలపై ఛార్జీల విధింపు ఆందోళనలపై పేటీఎం వ్యవస్థాపకుడు, సీఈఓ విజయ్ శేఖర్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. రూ. 2,000 మించిన నిర్దిష్ట లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలు విధించాలన్న ఎన్‌పీసీఐ నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఇది 'రాబిన్ హుడ్' తరహా విధానమని, దీనివల్ల సామాన్య వినియోగదారులకు, చిన్న వ్యాపారులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే అందుబాటులో ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. పెద్ద ఈ-కామర్స్ సంస్థలు, రిటైల్ చైన్‌ల వంటి భారీ వ్యాపారుల నుంచి ఛార్జీలు వసూలు చేయడం ద్వారా వచ్చే ఆదాయాన్ని, చిన్న వ్యాపారులకు, సాధారణ ప్రజలకు యూపీఐ సేవలను ఉచితంగా కొనసాగించేందుకు వినియోగించవచ్చని శర్మ వివరించారు. ఇతర చెల్లింపు విధానాలకు ఇప్పటికే ఛార్జీలు వర్తిస్తున్నాయని, ఇప్పటివరకు యూపీఐ వ్యవస్థ ప్రధానంగా ప్రభుత్వ మద్దతుతోనే కొనసాగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కొత్త నిర్ణయం యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేస్తుందని, చిరు వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేలా ఉండటం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన అనంతరం స్టాక్ మార్కెట్లో పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్లు భారీగా పుంజుకున్నాయి. ఇంట్రాడేలో ఇవి 7.24% పెరిగి, రూ. 1,856.50 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకాయి. పేటీఎం బాటలోనే మొబిక్విక్, పైన్‌ల్యాబ్స్ వంటి ఇతర ఫిన్‌టెక్ కంపెనీల షేర్లలో కూడా సానుకూల ధోరణి కనిపించింది.

## 8 నిమిషాల్లోనే కొత్త పాస్‌పోర్ట్

**దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో అద్భుతం**




దుబాయ్: విదేశీ ప్రయాణానికి అంతా సిద్ధం చేసుకున్నాక, చివరి నిమిషంలో పాస్‌పోర్ట్ గడువు ముగిసిపోతోందని తెలిస్తే ఎలా ఉంటుంది? అలాంటి తీవ్రమైన టెన్షన్‌కు దుబాయ్ ప్రభుత్వం కేవలం 8 నిమిషాల్లో తెరదించింది. యూఏఈ పౌరుడికి దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిమిషాల వ్యవధిలోనే పాస్‌పోర్ట్‌ను పునరుద్ధరించి, తమ సేవల సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. ఎమిరేట్స్ పౌరుడొకరు మరుసటి రోజు ప్రయాణానికి సిద్ధమవుతుండగా తన పాస్‌పోర్ట్ గడువు మరో నెలలో ముగియనుందని గమనించాడు. అయితే, తాను వెళ్లాల్సిన దేశానికి పాస్‌పోర్ట్‌పై కనీసం ఆరు నెలల చెల్లుబాటు తప్పనిసరి. దీంతో ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతుండగా, దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని పాస్‌పోర్ట్ పునరుద్ధరణ కేంద్రాన్ని సంప్రదించమని స్నేహితులు సూచించారు. వెంటనే విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు, అక్కడి అధికారులు 10 నిమిషాల్లో పని పూర్తవుతుందని చెప్పారు. కానీ, కేవలం ఎనిమిది నిమిషాల్లోనే కొత్త పాస్‌పోర్ట్‌ను చేతికి అందించడంతో ఆ ప్రయాణికుడు ఆశ్చర్యపోయాడు. ఈ అనుభవాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకోగా, అది వైరల్ అయింది. "దుబాయ్ ఎయిర్‌పోర్ట్ కంటే వేగవంతమైనది ఏదీ లేదు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## అధికార లాంఛనాలతో ఆళ్ల నాని అంత్యక్రియలు

ఏలూరు, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని నిన్న విశాఖలో గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలకు సంబంధించి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విదేశాల్లో ఉన్న ఆయన ఇద్దరు కుమారులు ఈ రాత్రికి స్వదేశానికి చేరుకోనుండటంతో, కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు గురువారం ఏలూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం, పోలీసులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆళ్ల నాని, ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, 2024 ఎన్నికల అనంతర పరిణామాల్లో తెలుగుదేశం పార్టీలో చేరారు.

## ఇల్లు గడుస్తలే..! ఐబొమ్మ రవికి ఆర్థిక కష్టాలు

**బ్యాంకు ఖాతాల అన్‌ఫ్రీజ్ కోసం కోర్టుకు అభ్యర్థన**



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): ఐబొమ్మ కేసులో నిందితుడిగా ఉన్న రవి తాను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపాడు. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ కావడంతో కుటుంబాన్ని పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని పేర్కొంటూ నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. కనీసం కొన్ని ఖాతాలనైనా అన్‌ఫ్రీజ్ చేయాలని కోరాడు. ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా సినిమాలను అక్రమంగా ప్రసారం చేశారన్న కేసులో రవిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా అతడికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆస్తులకు సంబంధించిన డిపాజిట్లను పోలీసులు ఫ్రీజ్ చేశారు. దీంతో ప్రస్తుతం తన వద్ద డబ్బు అందుబాటులో లేకుండా పోయిందని రవి కోర్టుకు తెలిపాడు. ఖాతాలు పనిచేయకపోవడంతో కుటుంబ ఖర్చులు, నిత్యావసరాల కోసం డబ్బులు సమకూర్చుకోవడం ఇబ్బందిగా మారిందని పిటిషన్‌లో పేర్కొన్నాడు. తన వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఏర్పడిందని తెలిపాడు. కుటుంబాన్ని కొనసాగించేందుకు అవసరమైన కనీస ఖర్చుల కోసం అయినా కొంత మొత్తాన్ని వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోర్టును కోరాడు. రవి దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై పోలీసులు తమ వాదనను కోర్టుకు వివరించే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఖాతాలను ఫ్రీజ్ చేయాల్సిన అవసరం ఉందా? లేక కొన్ని ఖాతాలపై వెసులుబాటు కల్పించవచ్చా? అన్నది విచారణలో తేలనుంది. ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా పైరసీ సినిమాలను ప్రసారం చేసి రవి రూ.కోట్లు సంపాదించాడని పోలీసులు ఆరోపిస్తున్నారు.



## విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి: బీజేపీ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): సెప్టెంబర్ 17ను అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్/మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, కాంచి మహేందర్ మాట్లాడుతూ విమోచన పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు తమ పార్టీ ప్రతిపాదించిన 'తెలంగాణ సప్త సంకల్పాలు'ను అమలు చేయాలని కోరారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్మారక చిహ్నం, హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు, జిల్లా స్థాయిలో స్మృతి కేంద్రాల నిర్మాణం, పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్ర చేర్చడం, చారిత్రక ప్రాంతాల్లో స్మారక స్థూపాల నిర్మాణం, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు వంటి అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు. కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహా గణపతి హోమం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని శ్రీ సాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడో రోజు మహా గణపతి హోమాన్ని అర్చకులు సుమన్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను స్వీకరించారు. ప్రతి సంవత్సరం గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని మండప నిర్వాహకులు తెలిపారు. ఇది 9వ వార్షికోత్సవమని పేర్కొన్నారు.

## నేతన్నలకు అండగా సర్కారు: పుల్కం రాజు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): వేములవాడ పట్టణ చేనేత సహకార సంఘం 79వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గతంలో వేములవాడ ప్రాంతంలో నూలు డిపో లేకపోవడంతో చేనేత కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి నూలు తెప్పించుకునే క్రమంలో రవాణా ఖర్చుల భారం భరించాల్సి వచ్చేదని గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడలో నూలు డిపో ఏర్పాటు కావడం చేనేత కార్మికులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. గతంలో నిలిచిపోయిన రూ.250 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయించిందని తెలిపారు. అర్హులైన ప్రతి నేతన్నకు చేనేత పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని పుల్కం రాజు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి అర్హులకు పెన్షన్ మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ, కౌన్సిలర్ కొక్కల బాలకృష్ణ, నాయకులు నాగుల సత్యనారాయణ, నాగుల పరశురాములు, కొక్కుల శ్రీనివాస్, రాజేశం, రామస్వామి, దేవదాసు, కొక్కుల నర్సయ్యతో పాటు చేనేత కార్మికులు, పద్మశాలి సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుమ్మి పుల్లయ్య స్తూపం వద్ద సీపీఐ నివాళి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణంలోని కామ్రేడ్ గుమ్మి పుల్లయ్య స్తూపం వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు. వేములవాడ నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జి కడారి రాములు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి భూములను పంచిన ఘనత సీపీఐకి ఉందన్నారు. రైతులు, ప్రజల హక్కుల కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, మర్రిపల్లి, తిప్పాపూర్, నాంపల్లి పల్లగుట్ట ప్రాంతాల్లో రద్దైన పట్టాలను తిరిగి మంజూరు చేయాలని కోరారు. మరిమడ్ల కొండం చెరువులోని 80 ఎకరాలకు పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పోడు భూములకు కూడా పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడలో రోడ్లు, మార్కెట్, గుడి పనులు, గుడిచెరువు పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మి పుల్లయ్య వారసులు గుమ్మి పవన్, మధు మహేష్, సీపీఐ నాయకులు గాజుల పోశెట్టి, కేవీ అనసూర్య, పందుల మల్లేశం, కోరేపు క్రాంతి, కోకాపెల్లి శాంత, కిరణ్, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

## తొలిరోజు భీమన్నకు 1.91 కోట్లు

**నేడూ కొనసాగనున్న హుండీ లెక్కింపు**

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హుండీ లెక్కింపులో భారీ ఆదాయం నమోదైంది. 28 రోజుల హుండీ లెక్కింపులో భాగంగా తొలి రోజు లెక్కించిన మొత్తాలను ఆలయ అధికారులు వెల్లడించారు. తొలి రోజు లెక్కింపులో రూ.1,91,64,681 నగదు లభించింది. అలాగే 119 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 9 కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు ప్రక్రియను ఆలయ ఈఓ రమాదేవి, కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయ పరిశీలకుడు రాజమౌళి, ఆలయ డీఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పోలీసులు, శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. హుండీ లెక్కింపు రెండో రోజు కూడా కొనసాగుతుందని ఆలయ ప్రజా సంబంధాల అధికారి పెరిక శ్రీనివాస్ తెలిపారు.

## మోదీ 25 ఏళ్ల పాలనకు గుర్తుగా కీ చైన్లు

మల్యాల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాజీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మల్యాల మండల బీజేపీ కార్యకర్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కీ చైన్లను ఆవిష్కరించారు. కేంద్ర మంత్రుల చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘం నరేశ్, మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి, సంగని రవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతమ్, నులుగొండ సురేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు పద్య పఠన పోటీలు




జగిత్యాల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): తెలుగు భాషా ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పద్య పఠన పోటీలు గురువారం జగిత్యాల డీసీఈబీ భవనంలో నిర్వహించారు. మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లాలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ద్వితీయ భాషగా తెలుగు అభ్యసిస్తున్న విద్యార్థులకు కూడా ప్రత్యేకంగా పద్య పఠన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.1,000, ద్వితీయ బహుమతిగా రూ.500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి కె. రాము హాజరయ్యారు. విశిష్ట అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి మురళీ మనోహరాచారి, డాక్టర్ ఎల్లాల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వేణుబాబు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు డాక్టర్ ఎల్లాల శ్రీనివాసరెడ్డి భోజన వసతి కల్పించారు. ఇందుకు తెలుగు భాషా ఫోరం సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా ఫోరం అధ్యక్షుడు బి. శేషగిరి, ప్రధాన కార్యదర్శి ముత్యంపేట గంగాధర్‌తో పాటు జిల్లాలోని తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫోరం కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఫోరం నిర్వాహకులు విజయవంతంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు.

# విముక్తి పోరాటాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

**హైదరాబాద్ విమోచన దినోత్సవంపై బండారు దత్తాత్రేయ**



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఎందరో మహనీయులు త్యాగాలు, బలిదానాలు చేశారని, వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17వ తేదీ చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఫొటో ప్రదర్శనను బుధవారం బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుతో కలిసి ప్రదర్శనను పరిశీలించారు. హైదరాబాద్ సంస్థానంలో ప్రజలపై జరిగిన దమనకాండ, నిజాం వ్యతిరేక పోరాటంలో సమరయోధుల పాత్ర, భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం వరకు జరిగిన ప్రధాన సంఘటనలను వివరిస్తూ ప్రదర్శన ఏర్పాటు చేసిన సీబీసీని ఆయన అభినందించారు. ప్రతి విద్యార్థి ఈ ప్రదర్శనను సందర్శించాలని సూచించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ వందేమాతరం నినాదం చేసినందుకు జైలుకు పంపడం, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు కాల్చి చంపడం వంటి ఘటనలు నిజాం పాలనలో చోటుచేసుకున్నాయని అన్నారు. ప్రజలకు లభించిన స్వేచ్ఛ, గౌరవం వెనుక ఎన్నో త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాంజీ గోండు, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ తదితరుల త్యాగాలను నేటి తరం గుర్తుంచుకోవాలని కోరారు. సీబీసీ, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ ప్రదర్శన ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సమీర్ నందా, డైరెక్టర్ రాజీవ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు ఘనంగా శ్రీమంతం



జగిత్యాల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా చల్గల్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జున్ను రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పది మంది గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సత్కరించి శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జున్ను రాజేందర్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులతో పాటు సమాజం కూడా వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ, ఏసీడీపీఓతో పాటు ఉపసర్పంచ్ మహమ్మద్ రొమాన్, వార్డు సభ్యులు పడాల నరేష్, పెండెం అనిల్, అరిగళ్ళ వేణు, బింగి దివ్యరాణి, చిన్నకొలా లావణ్య, కోల మౌనిక, తడగొండ లక్ష్మణ్, శివరాత్రి రాజం, కోల నారాయణ, పంచాయతీ సిబ్బంది, గ్రామ మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## నాసిరకం బీటీ రోడ్డు

**కంకర తేలి వాహనదారులకు ఇబ్బందులు.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి**

**మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

జగిత్యాల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని టవర్ నుంచి గంజ్ రోడ్డు వరకు ఇటీవల వేసిన బీటీ రోడ్డు నాసిరకంగా ఉందని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రోడ్డును పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కంకర తేలి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం రోడ్డును తొలగించి నాణ్యతా ప్రమాణాలతో తిరిగి రోడ్డు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, హరీష్, గాజుల లావణ్య, అల్లాల సరిత, రమేష్ రావు, సింగరావు, నక్క జీవన్, మొగిలి, శివకుమార్, గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భవానీ అంకురార్పణకు శ్రీకారం

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): కనకదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న దశమ శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి రూపానికి అంకురార్పణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఉదయం 9.45 గంటలకు శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక్ ఆధ్వర్యంలో ఈ పవిత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఋత్వికులు గోవిందుల రాధాకృష్ణ, అజయ్‌ల బృందం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. దీనికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కనకదుర్గ సేవా సమితి నిర్వాహకులు కోరారు.

## గుంతలతో ప్రమాదకరంగా రోడ్లు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): మూసాపేట పరిధిలోని భారత్‌నగర్ ఈడబ్ల్యూహెచ్ఎస్-727 ప్రాంతంలో డ్రైనేజీ సమస్యలు, రహదారిపై ఏర్పడిన గుంతలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో అవి కనిపించక వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చిన్నారులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్ చుట్టూ రహదారి దెబ్బతినడంతో పాటు పక్కనే పెద్ద గుంత ఏర్పడింది. కాలనీకి చెందిన అభిలాష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల భద్రత దృష్ట్యా జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. గుంతలను పూడ్చడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

## వినాయక పూజల్లో బండి రమేష్

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): మూసాపేట డివిజన్‌లో తూము రజినీకాంత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. బండి రమేష్ మాట్లాడుతూ వినాయక చవితి ప్రజల్లో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, తూము సంతోష్, ఎల్లారావు, సతీష్ గౌడ్, కర్రెమ్మ, ఇజాజ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి తనిఖీ

జగిత్యాల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి సరిత మట్టా బుధవారం జగిత్యాల ప్రత్యేక సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, జైలులో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ హక్కులు, చట్టపరమైన సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించిన ఆమె స్వయంగా రుచి చూసి భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఖైదీలకు నాణ్యమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు సూచించారు. న్యాయ సహాయం అవసరమైన ఖైదీలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## సాలార్‌జంగ్ మ్యూజియం క్విజ్‌లో ఆర్మీ పబ్లిక్ స్కూల్ విజయం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియం, కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు అంతర్ పాఠశాల క్విజ్ నిర్వహించారు. జంట నగరాల్లోని 25 పాఠశాలలకు చెందిన 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా, ప్రాథమిక దశ అనంతరం 16 బృందాలు తుది పోటీకి ఎంపికయ్యాయి. బొల్లారంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, అబిడ్స్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ ద్వితీయ, త్రిముల్‌ఘెరిలోని పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయం తృతీయ స్థానాలను సాధించాయి. విజేతలకు హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్స్‌లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా సత్కారం జరగనుంది. సాలార్‌జంగ్ మ్యూజియం విద్యా విభాగ క్యూరేటర్ జ్యోతి రాయ్ మాట్లాడుతూ హైదరాబాద్ చరిత్ర, సంస్కృతిపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు ఈ క్విజ్ దోహదపడిందన్నారు. విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా పాత్రను ఆమె అభినందించారు.

## క్రిప్టో వివాదం.. కిడ్నాప్, దాడి

**ఏడుగురు నిందితుల అరెస్టు.. కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

జగిత్యాల, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో నమోదైన మిస్సింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. క్రిప్టో పెట్టుబడులు, డబ్బుల లావాదేవీల వివాదమే కిడ్నాప్, దాడికి దారితీసినట్లు జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. బుధవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామానికి చెందిన మోనాల లావణ్య తన భర్త మోనాల మారుతి కనిపించడం లేదని ఫిబ్రవరి 19న జగిత్యాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, టౌన్ ఎస్ఐ కె. కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని డీఎస్పీ తెలిపారు. సెప్టెంబరు 15న మారుతి స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనను కొంతమంది వ్యక్తులు కిడ్నాప్ చేసి, కళ్లకు గంతలు కట్టి గుర్తుతెలియని ప్రదేశానికి తీసుకెళ్లి కొట్టారని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తన వద్ద డబ్బులు ఇవ్వాలని హింసించడంతో పాటు కత్తితో చంపుతామని బెదిరించారని, చల్గల్ గ్రామంలోని తన ఇంటిని అనిల్‌కుమార్ పేరుపై రిజిస్ట్రేషన్ చేయకపోతే తనను, కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు మారుతి ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అనంతరం తన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను లాక్కొని మరుసటి రోజు ఇంటి సమీపంలో వదిలివెళ్లినట్లు వెల్లడించారు. నిందితులు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో జగిత్యాల బైపాస్ రోడ్డులోని వివేకానంద విగ్రహం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని డీఎస్పీ తెలిపారు. పంచుల సమక్షంలో విచారించి వారి వద్ద నుంచి టీజీ 21 ఏ 9689 నంబరు గల కారుతో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. నిందితులుగా బెజ్జంకి అనిల్‌కుమార్, కనుకుంట్ల జగదీశ్వర్, కుసుంబ నిఖిల్‌కుమార్, జువ్వాడి దీక్షిత్, కటారి వంశీకృష్ణ, మహమ్మద్ ఖలీల్ రహమాన్, గంద్ర సాయి ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

## క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ: కోరుట్ల ఎమ్మెల్యే

మెట్‌పల్లి, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందితే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు.




## బీర్పూర్‌లో ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

బీర్పూర్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): బీర్పూర్ మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ హరీష్, మండల విద్యాధికారి, ఎస్జీఎఫ్ చైర్‌పర్సన్ స్వరూప నాగభూషణం, బీర్పూర్ ఎస్ఐ పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాల్లో కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో పాల్గొంటారు. ఎస్జీఎఫ్ కన్వీనర్ మంజుల ధరణి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యూపీఐ చార్జీలపై వెనక్కి తగ్గం

**అక్టోబర్ 15 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి**

**ఈ చార్జీలు వ్యాపారులకు మాత్రమే**

**కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) విధించే నిర్ణయంపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నూతన విధానం 2026 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తుందని, దీనిపై పునరాలోచన చేసే ఉద్దేశం లేదని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. అయితే, ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే వర్తిస్తాయని, యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిపే నగదు బదిలీలు (పీ2పీ) ఎప్పటిలాగే ఉచితంగానే కొనసాగుతాయి. అలాగే, క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. దేశంలో 95 శాతం వ్యాపార లావాదేవీలు రూ.2,000 లోపే జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు గుర్తుచేశారు. యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గతంలో 'జీరో-ఎండీఆర్' ప్రోత్సాహక పథకం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 2,000 కోట్లు వెచ్చించాల్సి వచ్చేదని, కొత్త విధానంతో ఆ భారం తప్పుతుందని భావిస్తోంది. ఉచిత చెల్లింపుల విధానం దీర్ఘకాలంలో ఏ మేరకు సమర్థవంతంగా కొనసాగుతుందనే అంశంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలోనే ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. దీనిని 'యూపీఐ పన్ను'గా అభివర్ణించిన ఆయన, అమెరికా ఒత్తిళ్లకు ప్రధాని మోదీ తలొగ్గారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఖండించింది. దేశంలో స్వయం సమృద్ధమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నామని, ఇందులో ఎటువంటి విదేశీ ఒత్తిడి లేదని స్పష్టం చేసింది.




## జియో యూజర్లకు కాన్వా ప్రో ఫ్రీ

ముంబై: తమ నెట్‌వర్క్ ఉపయోగిస్తున్న కంటెంట్ క్రియేటర్లు, విద్యార్థులు, డిజిటల్ డిజైనర్లకు రిలయన్స్ జియో అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది. గ్లోబల్ డిజైనింగ్ ప్లాట్‌ఫారమ్ కాన్వాతో చేతులు కలిపింది. తమ నెట్‌వర్క్ వినియోగదారులకు దాదాపు రూ. 4000 విలువైన కాన్వా ప్లాట్‌ఫామ్ సేవలను 12 నెలల పాటు ఉచితంగా అందించనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా కోట్ల మంది భారతీయ వినియోగదారులు మొబైల్‌లోనే ప్రొఫెషనల్ స్థాయి సోషల్ మీడియా పోస్టర్లు, రీల్స్, ప్రెజెంటేషన్లు, డిజైన్లను సులభంగా తయారు చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. జియో వినియోగదారులు ఎంచుకునే రీఛార్జ్ ప్లాన్‌ను బట్టి ఈ ఉచిత సబ్‌స్క్రిప్షన్ ఆధారపడి ఉంటుంది. రూ.399 ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకునే వారికి 12 నెలలు కాన్వా ప్రో ఉచితంగా లభిస్తుంది. ఇందులో 100జీబీ క్లౌడ్ స్టోరేజ్, కాన్వా ఏఐ టూల్స్, కంటెంట్ ప్లానర్ లాంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఉంటాయి. రూ.349 ప్లాన్ లేదా అంతకంటే ఎక్కువ విలువైన 2జీబీ డేటా ప్లాన్ రీఛార్జ్ చేసుకునే యూజర్లకు 12 నెలల పాటు కాన్వా ప్రో లైట్ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తుంది. ఇందులో 50జీబీ క్లౌడ్ స్టోరేజ్, బ్యాక్‌గ్రౌండ్ రిమూవర్, మ్యాజిక్ రీసైజ్, లక్షలాది ప్రీమియం టెంప్లెట్లు లభిస్తాయి. కాన్వా ప్రో, ప్రో లైట్ రెండూ లక్షలాది ప్రీమియం టెంప్లెట్లు, వీడియోలు, ఫోటోలు, ఫాంట్లను పూర్తి యాక్సెస్ అందిస్తోంది. బ్యాక్‌గ్రౌండ్ రిమూవర్, మ్యాజిక్ రీసైజ్, మ్యాజిక్ ఎరేజర్ వంటి అధునాత ఫీచర్లను సైతం ఈ రెండు వెర్షన్లలో అందిస్తున్నారు. కాన్వా ప్రోలో సోషల్ మీడియా పోస్టులను ముందుగానే షెడ్యూల్ చేయడానికి కంటెంట్ ప్లానర్, అధునాత, ఏఐ టూల్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. హిందీతో పాటు పలు ప్రాంతీయ భారతీయ భాషలు ఇందులో ఉంటాయి. దీంతో సాధారణ యూజర్లు సైతం చాలా సులభంగా ఉపయోగంచవచ్చని కాన్వా చెబుతోంది.




## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే: ఫోన్‌పే

న్యూఢిల్లీ: యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు.

## షహజాద్ భట్టి సంస్థపై బ్యాన్

**ఉగ్రసంస్థగా ప్రకటించిన కేంద్రం**

న్యూఢిల్లీ: పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను (ఎస్‌బీఎన్) కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్ 35 కింద కేంద్ర హోంశాఖ బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో షహజాద్ భట్టి నెట్‌వర్క్ సంస్థతో పాటు దాని సభ్యులపై ఉగ్రవాద నిధులు (టెర్రర్ ఫైనాన్సింగ్), కుట్ర వంటి తీవ్రమైన అభియోగాల కింద కేసులు నమోదు చేసేందుకు దర్యాప్తు సంస్థలకు మార్గం సుగమమైంది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అందులో భాగంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ సంస్థ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తూ, యువతను, చిన్నచిన్న నేరస్థులను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్‌తో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, మత సామరస్యానికి ఈ సంస్థ విఘాతం కలిగిస్తోందని హోంశాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతో నడుస్తున్న సిండికేట్‌గా అధికారులు ఎస్‌బీఎన్‌ను అభివర్ణిస్తున్నారు. గ్రెనేడ్లు, ఐఈడీ దాడులు, లక్షిత హత్యలు, పోలీసు, రక్షణ, మతపరమైన ప్రదేశాలపై నిఘా వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ఈ సంస్థకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని అధినేత షహజాద్ భట్టి దుబాయ్, పాకిస్థాన్‌ల నుంచి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంటాడు. 2025 మార్చిలో పంజాబ్‌లోని జలంధర్‌లో యూట్యూబర్ రోజర్ సంధు నివాసంపై జరిగిన గ్రెనేడ్ దాడి, 2024 నవంబర్‌లో నటుడు మిథున్ చక్రవర్తికి అందిన బెదిరింపుల వెనుక భట్టి హస్తం ఉన్నట్లు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి.



## స్టాక్ మార్కెట్లకు లాభాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కోలుకున్నాయి. వరుసగా రెండు రోజుల నష్టాల తర్వాత సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు చమురు ధరలు తగ్గడం కూడా మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ 332.63 పాయింట్లు లాభపడి 74,336.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు పెరిగి 23,217.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐటీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. అయితే మార్కెట్‌లో మొత్తం కొనుగోళ్ల జోరు కనిపించలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం స్వల్పంగా తగ్గింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం నష్టపోయింది. రంగాల వారీగా ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ సూచీలు లాభాల్లో ముందున్నాయి. ఐటీ, ఫార్మా సూచీలు ఎక్కువగా నష్టపోయాయి.

## కేసీఆర్‌కు రేవంత్ క్షమాపణ చెప్పాలి: సుంకె

గంగాధర, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించి గతంలో చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సమాజానికి, కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 67 ఎకరాల భూమి మాత్రమే ఉందని అసెంబ్లీలో వెల్లడించారని, గతంలో చేసిన ఆరోపణలకు ఇది భిన్నంగా ఉందని ఆయన పేర్కొన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ఈ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి సభలో చర్చ జరపడం సరికాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధుల భూ లావాదేవీలపైనా విచారణ జరపాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. 22ఏ భూముల సమస్యతో పాటు ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఇతర ఆరోపణలపై విచారణకు సిద్ధంగా ఉండాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకత్వంపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి: వికాస్ రావు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణ ప్రజల శౌర్యం, త్యాగాలకు ప్రతీకగా నిలిచిన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'విమోచన దినోత్సవం'గా నిర్వహించాలని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు డిమాండ్ చేశారు. వేములవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17న విమోచనం లభించిందని తెలిపారు. ఆ కాలంలో నిజాం పాలన, రజాకార్ల చర్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. పరకాల, బైరాన్‌పల్లి ప్రాంతాల్లో రజాకార్ల దాడులు జరిగాయని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ప్రజలపై హింసకు పాల్పడ్డారని పేర్కొన్నారు. నిజాం పాలనను ప్రశ్నిస్తూ 'ఇమ్రోజ్' పత్రిక ద్వారా పోరాడిన జర్నలిస్టు షోయబుల్లా ఖాన్‌ను రజాకార్లు హత్య చేశారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేపట్టిన 'ఆపరేషన్ పోలో' అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. 1998 నుంచి సీహెచ్. విద్యాసాగర్‌రావు, ఎల్.కె. అద్వానీ నేతృత్వంలో బీజేపీ సెప్టెంబర్ 17ను విమోచన దినంగా నిర్వహించాలని ఉద్యమిస్తోందని తెలిపారు. విమోచన పోరాట చరిత్రను తెలియజేసే భారీ మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు బైరాన్‌పల్లి, పరకాల వంటి ప్రాంతాల్లో అమరవీరుల స్మారక స్థూపాలు నిర్మించాలని, చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.



## నిజాం వ్యతిరేక పోరాటం చరిత్రాత్మకం: సమత

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన నియంతృత్వానికి, అరాచకాలకు మారుపేరుగా సాగిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సమత అన్నారు. రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటాల ఫలితంగానే హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని పేర్కొన్నారు. బర్కత్‌పురలో ఆమె మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందన్నారు. రజాకార్ల దమనకాండకు బైరాన్‌పల్లి, పరకాల, వెయ్యి ఊడల మర్రి వంటి ప్రాంతాలు సాక్ష్యాలుగా నిలిచాయని తెలిపారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సెప్టెంబర్ 13న ప్రారంభమై, సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని వివరించారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, కొమురం భీమ్, రావి నారాయణరెడ్డి, సర్దార్ సర్వాయి పాపన్న తదితరుల త్యాగాలను ఆమె స్మరించారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ దినంగా పేర్కొంటూ, నాటి పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.



## పద్మశాలి సంఘంలో ఘనంగా గణపతి ఉత్సవాలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 16 (ఈవార్తలు): వేములవాడ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సంఘం నిర్వాహకులు మాట్లాడుతూ గత 40 ఏళ్లకు పైగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాతగా తాటికొండ రాజయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాంపల్లి వెంకటరమణ, కోశాధికారి రాపల్లి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తాడికొండ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు నాగుల విష్ణు, వాసం భూమేష్, నడిగట్ల భిక్షపతి, వాసం వెంకటస్వామి తదితరులతో పాటు సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వయ్యారి చిత్రం




## ది ప్యారడైజ్‌కు 'ఏ' సర్టిఫికెట్




నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ 'ఏ' సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, "'పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది ప్యారడైజ్' కథ" అని తెలిపారు. అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న విడుదల కానుంది.

## సుప్రీంకు చేరిన శ్రీదేవి ఆస్తి వివాదం

దివంగత నటి శ్రీదేవి కుటుంబానికి సంబంధించిన ఆస్తి వివాదం దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు చేరింది. చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న 2.7 ఎకరాల భూమికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు వివాదాస్పద ఆస్తి విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) పాటించాలని ఆదేశించింది. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించింది. అవసరమైతే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమిస్తామని స్పష్టం చేసింది. మధ్యవర్తిత్వ పురోగతిని సమీక్షించేందుకు కేసు తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. వివాదానికి కారణమైన ఈ భూమిని 1988 ఏప్రిల్ 19న శ్రీదేవి కుటుంబం కొనుగోలు చేసింది. అయితే, ఈ ఆస్తిలో తమకు వాటా ఉందని ఎంసీ శివకామి అనే మహిళ, ఆమె సోదరుడు పిటిషన్ దాఖలు చేశారు. గతంలో వీరి పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



## సందీప్ కిషన్‌కు ఫ్యాన్ అయిపోయా: జేసన్ సంజయ్

హీరో సందీప్ కిషన్ అంటే దర్శకుడు జేసన్ సంజయ్ కు చాలా ఇష్టమట. సందీప్ నటించిన మైఖేల్ సినిమా చూసిన తర్వాత ఆయనకు ఫ్యాన్ గా మారారట. ఇప్పుడు అదే హీరోతో తన మొదటి సినిమాను తెరకెక్కించారు. దీంతో సిగ్మా విషయంలో ఇంట్రెస్టింగ్ ఫ్యాన్ కనెక్షన్ హాట్ టాపిక్ గా మారింది. కోలీవుడ్ స్టార్ హీరో, సీఎం విజయ్ కొడుకు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమానే సిగ్మా. సందీప్ కిషన్ హీరోగా నటిస్తుండగా.. ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా కనిపించనున్నారు. అడ్వెంచర్, ట్రెజర్ హంట్, యాక్షన్ ఎలిమెంట్స్ తో సినిమా రూపొందింది. తన మొదటి సినిమాతోనే పక్కా కమర్షియల్ మూవీ చేయాలని జేసన్ ఫిక్స్ అయినట్లు ఆయన కామెంట్స్ బట్టి తెలుస్తోంది. సిగ్మా గురించి జేసన్ మాట్లాడుతూ, ఇదే తన ఫస్ట్ ఫిల్మ్ అని చెప్పారు. అక్టోబర్ 2న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. సినిమా కోసం మరిన్ని ఈవెంట్స్ జరగనున్నాయని చెప్పారు. ముఖ్యంగా మూవీలో చాలా ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయని, అడ్వెంచర్, ట్రెజర్ ఎలిమెంట్స్ మెయిన్ గ్గ ఉంటాయని వెల్లడించారు. పక్కా కమర్షియల్ ఫిల్మ్ గా సిగ్మాను రూపొందించినట్లు తెలిపారు.




## కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సుప్రియ

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతినిధి సుప్రియ యార్లగడ్డకు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. కేంద్ర సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సీ) సభ్యురాలిగా ఆమె నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం సెన్సార్ బోర్డును పునర్వ్యవస్థీకరిస్తూ 18 మంది సభ్యులతో కూడిన నూతన జాబితాను విడుదల చేయగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి సుప్రియకు చోటు దక్కింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 16న అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. సినిమాటోగ్రాఫ్ చట్టం నిబంధనల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించింది. నూతన సభ్యుల పదవీకాలం మూడేళ్ల పాటు కొనసాగుతుందని, ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. కొత్తగా నియమితులైన వారిలో సుప్రియతో పాటు బాలీవుడ్ నటులు ప్రీతి జింటా, సునీల్ శెట్టి, పంకజ్ త్రిపాఠి, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్, బెంగాలీ నటుడు ప్రసేన్‌జిత్ ఛటర్జీ, వినోద్ అనుపమ్, మనోజ్ జోషి, అభిషేక్ జైన్, రిక్కీ కేజ్, హన్సరాజ్ హన్స్, యతీంద్ర మిశ్రా, రూపాలీ గంగూలీ, నీల మదబ్ పాండా, పల్లవి జోషి, నిషిగంద వాద్, వామన్ కేంద్రే, రమేశ్ పతంగె వంటి సినీ ప్రముఖులు ఉన్నారు.



## రేపు సిగ్మా ట్రైలర్ గ్రాండ్ లాంచ్

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ 'సిగ్మా' రోజురోజుకూ ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లు సినిమాపై విపరీతమైన క్యూరియాసిటీని పెంచేశాయి. ఈ క్రమంలోనే మూవీ టీమ్ ఫ్యాన్స్‌కు మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ నెల 18న గ్రాండ్‌గా ఆడియో ట్రైలర్ లాంచ్ చేయనున్నట్లు ప్రకటించడంతో సినిమాపై బజ్ నెక్స్ట్ లెవెల్‌కి చేరింది. ఈ సినిమాలో సందీప్ కిషన్‌ను సరికొత్తగా, చాలా స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో ప్రెజెంట్ చేశారు. ఆయన బాడీ లాంగ్వేజ్, క్యారీ చేసిన క్యారెక్టర్ చూస్తుంటే థియేటర్లలో సీట్ ఎడ్జ్ ఎక్స్‌పీరియన్స్ ఖాయంగా కనిపిస్తోంది. ఇక ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్ వంటి నటులు ముఖ్య పాత్రల్లో కనిపిస్తూ సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చారు.




## మహారాజ.. హాలీవుడ్ రీమేక్!

కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి -దర్శక,నటుడు అనురాగ్ కశ్యప్ ప్రధాన పాత్రల్లో నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రం 'మహారాజ' అంతర్జాతీయ స్థాయిలో ఘనత సాధించింది. 2024లో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు రాబట్టడమే కాకుండా విమర్శకుల నుండి అపారమైన ప్రశంసలు అందుకుంది. తాజాగా ఈ చిత్రాన్ని హాలీవుడ్‌లో రీమేక్ చేయబోతున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. దీంతో హాలీవుడ్‌లో రీమేక్ అవుతున్న తొలి తమిళ చిత్రంగా 'మహారాజ' సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ చారిత్రాత్మక ఘనతపై 'మహారాజ' నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేసింది. ఓ ప్రముఖ హాలీవుడ్ మేజర్ స్టూడియో సినిమా రీమేక్ హక్కులను దక్కించుకుందని నిర్మాతలు తెలిపారు. డైరెక్టర్ నిథిలన్ సామినాథన్ స్క్రీన్ ప్లే, టేకింగ్ ఈ గ్లోబల్ గుర్తించేందుకు ప్రధాన కారణమని నెటిజన్లు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమిళ సినిమా సత్తా ఏంటో? మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన మైలురాయిపై కోలీవుడ్ వర్గాలు గర్విస్తున్నాయి.




## రాషా తడానీ.. టాలీవుడ్‌లో కష్టమే



ప్రముఖ బాలీవుడ్ నటి రవీనా టాండన్, సినిమా డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడానీ దంపతుల కుమార్తె రాషా తడానీ. తొలిసారి తన తల్లిదండ్రుల బ్యాక్ గ్రౌండ్ ఉపయోగించకొని హిందీలో ఆజాద్ అనే చిత్రంతో అరంగేట్రం చేసింది . ఇందులో అజయ్ దేవగన్, అమన్ దేవగన్, డయానా పెంటి వంటి తారలు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తర్వాత తెలుగులో శ్రీనివాస మంగాపురం అనే సినిమా చేసింది. పైగా ఈ సినిమాలో దివంగత నటుడు కృష్ణ వారసుడు జయకృష్ణ కూడా తొలి పరిచయంలో ఈ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఇందులో ఇద్దరి నటన బాగున్నప్పటికీ సినిమాలో సోల్ లేకపోవడం వల్ల ప్రేక్షకులు ఆదరించలేకపోయారు. మొదటి సినిమానే డిజాస్టర్ గా నిలవడంతో మళ్లీ రాషాకి మరో ప్రాజెక్ట్ లో అవకాశం లభించలేదు. మరి నిజంగానే ఈమెకు అవకాశాలు రావట్లేదా? లేక ఇక్కడ మొదటి సినిమానే డిజాస్టర్ గా నిలవడంతో బాలీవుడ్ వైపే చూస్తోందా అన్న కామెంట్లు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు ఇప్పటికే ఇండస్ట్రీలో ఎంతోమంది కుర్ర హీరోయిన్లు తమ అద్భుతమైన నటనతో దూసుకుపోతున్నారు. ఇలాంటి సమయంలో రాషా తడానీకి మళ్లీ తెలుగులో అవకాశం లభించడం కష్టమేనా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## ఏషియన్ గేమ్స్‌కూ
# వరుణ్ దూరం

టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఏషియన్ గేమ్స్ 2026కు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి దూరమయ్యాడు. సైడ్ స్ట్రెయిన్ గాయం నుంచి సకాలంలో కోలుకోలేకపోవడంతో అతడిని జట్టు నుంచి తప్పించారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ తర్వాత ఏషియన్ గేమ్స్‌లోనూ వరుణ్ కనిపించడు. ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో వరుణ్ గాయపడ్డాడు. ఢిల్లీలో జరిగిన ఆ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 16 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. అయితే బౌలింగ్ సమయంలో ఎడమ వైపు పొత్తికడుపులో అసౌకర్యం మొదలైంది. స్కానింగ్‌లో సైడ్ స్ట్రెయిన్ ఉన్నట్లు తేలింది. దీంతో మిగిలిన రెండు టీ20లకు అతడికి విశ్రాంతినిచ్చారు. ఆఫ్ఘన్ సిరీస్ నుంచి తప్పుకొన్న సమయంలోనే



వరుణ్ ఏషియన్ గేమ్స్ ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. తాజాగా ఆ అనుమానాలకు తెరపడింది. గాయం నుంచి కోలుకునేందుకు సమయం సరిపోకపోవడంతో ఏషియన్ గేమ్స్‌కు అతడు దూరమయ్యాడు. దీంతో భారత జట్టులో మార్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుణ్ ఇటీవలే జట్టులోకి తిరిగొచ్చాడు. ఇంగ్లాండ్ పర్యటనలో జులైలో హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో అతడు సుమారు రెండు నెలలు ఆటకు దూరమయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందాడు. ఫిట్‌నెస్ సాధించిన తర్వాత ఆఫ్ఘన్ సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చాడు. పునరాగమన మ్యాచ్ ఆడిన వెంటనే మరో గాయం కావడం అతడికి ఇబ్బందిగా మారింది.





వన్డే జట్టుకు గిల్, టీ20కి శ్రేయస్ కెప్టెన్లు

ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియాకు పంత్ సారథ్యం

విండీస్ సిరీస్‌కు నితీశ్ ఎంపిక

# విండీస్ సిరీస్‌కు భారత జట్ల ఎంపిక

స్వదేశంలో వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లతో పాటు, ఇరానీ కప్ కోసం జట్లను భారత పురుషుల సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించింది. ఈ సిరీస్‌ల కోసం పలువురు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తూ, కెప్టెన్సీలో కూడా కీలక మార్పులు చేసింది.

**వన్డే జట్టుకు యువ సంచలనం శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, టీ20 జట్టు పగ్గాలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించారు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు చోటు దక్కింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.**

తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డితో పాటు గుర్‌నూర్ బ్రార్, అకిబ్ నబీ వంటి కొత్త ముఖాలకు ఈ జట్టులో అవకాశం లభించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో యువ జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. తెలుగు ఆటగాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ వంటి యువ ప్రతిభావంతులకు ఈ జట్టులో చోటు కల్పించారు. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు. మరోవైపు, రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్మూ కాశ్మీర్‌తో జరిగే ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ నాయకత్వం వహించనున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టులో పలువురు దేశవాళీ స్టార్లు చోటు దక్కించుకున్నారు. గాయం కారణంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి జపాన్ టీ20, ఆసియా క్రీడలకు దూరమయ్యాడు. అతని స్థానంలో విప్రాజ్ నిగమ్‌ను ఎంపిక చేశారు. తొలుత ఆసియా క్రీడల జట్టులో ఉన్న నితీశ్ కుమార్ రెడ్డిని, వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేయడంతో ఆసియా క్రీడల నుంచి తప్పించారు.



**వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్‌నూర్ బ్రార్, మహ్మద్ సిరాజ్, అకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

**వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు:**

శ్రేయస్ (కెప్టెన్), అభిషేక్ , వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్.

**జపాన్ టీ20, ఆసియా క్రీడలకు భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ, యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్.

**ఇరానీ కప్‌కు రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు:**

పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), సనత్ సంగ్వాన్, శిఖర్ మోహన్, సుదీప్ ఘరామి, సర్ఫరాజ్ ఖాన్ (వైస్ కెప్టెన్), స్మరణ్ రవిచంద్రన్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, ముకేశ్ చౌదరి, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), ఆర్యన్ పాండే, అనుకుల్ రాయ్, ఆయుష్ దోసేజ.



## దూకుడును మార్చుకోను: శాంసన్

ఆఫ్ఘనిస్థాన్‌తో రెండో టీ20లో 22 బంతుల్లోనే 57 పరుగులు. కళ్లుచెదిరే స్ట్రైక్‌రేట్‌తో సంజూ శాంసన్ చెలరేగాడు. భారత్‌కు సిరీస్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే ఈ ఇన్నింగ్స్ వెనుక మరో పోరాటం ఉందని శాంసన్ చెప్పాడు. మళ్లీ విఫలమైతే బయట నుంచి విమర్శలు వస్తాయని తెలిసినా.. తన ఆటతీరును మార్చుకోనని స్పష్టం చేశాడు. భారత్ తరఫున ఆడేటప్పుడు వైఫల్యాలను ఎదుర్కోవడం అంత సులభం కాదని శాంసన్ అన్నాడు. అయితే అనుభవంతో దానిని ఎలా అధిగమించాలో నేర్చుకున్నానని చెప్పాడు. బయట జరుగుతున్న చర్చను పక్కన పెట్టి, దూకుడుగా ఆడటంపైనే దృష్టి పెడతానని తెలిపాడు. "మళ్లీ విఫలమైతే చాలా విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా అత్యధిక స్ట్రైక్‌రేట్‌తో ఆడేందుకు ప్రయత్నిస్తా. అవకాశాలు తీసుకుంటా. ఎక్కువ పరుగులు చేసి జట్టుకు ఉపయోగపడటమే నా లక్ష్యం" అని శాంసన్ పేర్కొన్నాడు. టీ20ల్లో ప్రతి మ్యాచ్‌లో ఒకేలా ఫలితం రావడం సాధ్యం కాదని శాంసన్ చెప్పాడు. పవర్‌ప్లేలో వీలైనన్ని పరుగులు చేయాలన్న దూకుడే భారత ఆటతీరులో భాగమని వివరించాడు. కొన్నిసార్లు అది ఫలిస్తుందని, మరికొన్ని సార్లు విఫలమవుతుందని చెప్పాడు. ఫలితాల్లో నిలకడ కంటే సన్నద్ధతలో నిలకడ ఉండాలని శాంసన్ అన్నాడు. సాధన, కష్టపడే విధానం, మానసిక స్థితిపై దృష్టి పెడతానని తెలిపాడు. "ఫలితాన్ని మనం నియంత్రించలేం. మన ప్రక్రియను మాత్రం నియంత్రించగలం" అని చెప్పాడు. భారత్ టాప్-3లో చోటు కోసం పోటీని ఆటగాళ్లు వేరే కోణంలో చూస్తారని శాంసన్ వివరించాడు. బయటివారికి తాము పోటీదారులుగా కనిపించినా.. జట్టులో మాత్రం అందరూ కలిసి ఆడతామని చెప్పాడు. ఎవరికైనా అవకాశం వస్తే వారు రాణించాలని కోరుకుంటామని తెలిపాడు. విమర్శలు తనను అసలు ప్రభావితం చేయవని చెప్పడం నిజం కాదని శాంసన్ అంగీకరించాడు. "నేను యంత్రాన్ని కాదు. కొన్ని వ్యాఖ్యలు బాధిస్తాయి. కానీ తర్వాత నాతో నేనే మాట్లాడుకుంటా. నేను ఎవరో, ఏం చేయాలో గుర్తు చేసుకుంటా" అని చెప్పాడు.

## మానసిక బలమే ముఖ్యం: నితీశ్ రెడ్డి




గాయం నుంచి కోలుకుని భారత జట్టులోకి తిరిగొచ్చిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఆఫ్ఘనిస్థాన్‌తో రెండో టీ20లో అద్భుతంగా ఆడి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. మూడు వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన నితీశ్.. గాయం తర్వాత ఆటలో నిలదొక్కుకోవడానికి ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పాడు. రెండో టీ20లో నితీశ్ 24 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అతడి బౌలింగ్‌తో భారత్ ఆఫ్ఘనిస్థాన్‌ను 159/8కే పరిమితం చేసింది. అనంతరం భారత్ ఏడు వికెట్ల తేడాతో లక్ష్యాన్ని ఛేదించింది. "గాయం నుంచి తిరిగొచ్చిన ఆటగాడికి ఆత్మవిశ్వాసం చాలా అవసరం. తొలి మ్యాచ్‌లో నా ప్రదర్శన అంత బాగోలేదు. రెండో మ్యాచ్‌లో మాత్రం చాలా సంతోషంగా అనిపించింది. ఇప్పుడు వచ్చిన ఈ నమ్మకాన్ని ముందూ కొనసాగించాలి" అని బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో నితీశ్ చెప్పాడు. గాయం నుంచి కోలుకునే సమయంలో బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేసిన శ్రమను కూడా అతడు గుర్తుచేసుకున్నాడు. భారత జట్టు మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన నమ్మకం కూడా ఎంతో ఉపయోగపడిందని తెలిపాడు. జట్టులో చోటుపై ఆందోళన లేకుండా తన ఆటపై దృష్టిపెట్టేలా మేనేజ్‌మెంట్ అవకాశాలు ఇచ్చిందని చెప్పాడు. అయితే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎక్కువ కాలం ఉండటం మానసికంగా అలసటకు గురిచేసిందని నితీశ్ వెల్లడించాడు. ఆ సమయంలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడటం తనకు ఉపశమనం ఇచ్చిందని చెప్పాడు. అప్పుడప్పుడు ఇంటికి వెళ్లి ఒకటి, రెండు రోజులు గడిపి తిరిగి వచ్చేవాడినని తెలిపాడు. ఆల్‌రౌండర్‌గా తనపై పని భారం ఎక్కువగా ఉంటుందని నితీశ్ అన్నాడు. అందుకే శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవడంతో పాటు గాయం ఎదురైనప్పుడు మానసికంగా కూడా బలంగా ఉండాలని చెప్పాడు. "గాయాలు ఆటలో భాగమే. అలాంటి సమయంలో ప్రతికూల ఆలోచనలకు చోటివ్వకూడదు. మానసికంగా సానుకూలంగా ఉండాలి. మంచి విషయాలపై దృష్టిపెడితే సరైన సమయంలో మంచి ఫలితం వస్తుంది" అని పేర్కొన్నాడు.

## ఆటగాళ్లపై నమ్మకంతోనే గెలుపు సాధ్యం: యువీ

2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు. క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు.



ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు. గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు. ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# దేశానికి ఏది మంచిది?

పౌరసత్వం అనేది ఒక వ్యక్తికి లభించే సాధారణ హక్కు కాదు. అది ఒక దేశంతో అతని లేదా ఆమెకు ఉన్న చట్టపరమైన బంధం. అందుకే పౌరసత్వానికి సంబంధించిన ఏ మార్పైనా సహజంగానే దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తుంది. పౌరసత్వ సవరణ చట్టం-2019 విషయంలోనూ అదే జరుగుతోంది. కొందరు దీనిని పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులకు గురైన మైనారిటీలకు భారతదేశంలో ఆశ్రయం కల్పించే మానవతా చర్యగా చూస్తుంటే, మరికొందరు మతాన్ని పౌరసత్వ ప్రమాణాల్లోకి తీసుకురావడం రాజ్యాంగంలోని సమానత్వ సూత్రంపై ప్రశ్నలు లేవనెత్తుతుందని వాదిస్తున్నారు. సీఏఏను కేంద్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి 2014 డిసెంబర్ 31లోపు భారత్‌కు వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు కొన్ని షరతులతో భారత పౌరసత్వం పొందే మార్గాన్ని ఈ చట్టం సులభతరం చేస్తుంది. 2024 మార్చిలో కేంద్రం నిబంధనలు జారీ చేయడంతో చట్టం అమలుకు మార్గం ఏర్పడింది. ప్రభుత్వం వాదనలో ప్రధానంగా మానవతా అంశమే కనిపిస్తుంది. మతపరమైన అణచివేతకు గురై పొరుగు దేశాల నుంచి భారత్‌కు వచ్చిన నిర్దిష్ట వర్గాలకు పౌరసత్వం పొందే ప్రక్రియను సులభతరం చేయడమే ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. శరణార్థులుగా ఏళ్ల తరబడి భారత్‌లో నివసిస్తున్న వారికి ఒక చట్టబద్ధమైన జీవితం కల్పించడం అవసరమనే వాదనకు కూడా ఇందులో స్థానం ఉంది. అయితే వ్యతిరేక వాదనలను కూడా విస్మరించలేం. భారత రాజ్యాంగంలోని 14వ అధికరణం చట్టం ముందు సమానత్వాన్ని హామీ ఇస్తుంది. అలాంటప్పుడు మతాన్ని ఒక వర్గీకరణ ప్రమాణంగా ఉపయోగించడం సమానత్వ సూత్రానికి అనుగుణమా? మూడు దేశాలనే ఎందుకు ఎంపిక చేశారు? ఇతర దేశాల్లో మతపరమైన హింసకు గురవుతున్న వారికి ఈ చట్టం ఎందుకు వర్తించదు? ముస్లిం వర్గాలకు ఈ సదుపాయం ఎందుకు లేదు? అనే ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. ఇవి కేవలం రాజకీయ ప్రశ్నలు కాదు.. రాజ్యాంగపరమైన ప్రశ్నలు కూడా. ఇదే కారణంగా సీఏఏపై సుప్రీంకోర్టులో రాజ్యాంగపరమైన సవాళ్లు కొనసాగుతున్నాయి. చట్టం రాజ్యాంగబద్ధతపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. కాబట్టి ఈ చట్టంపై తుది న్యాయస్థాన నిర్ణయం వెలువడకముందే దాని రాజ్యాంగబద్ధతపై అంతిమ తీర్పులు ఇవ్వడం కంటే, న్యాయ ప్రక్రియను గౌరవించడం ప్రజాస్వామ్యానికి మంచిది.

# ఉద్యోగుల భవిష్యత్‌కు భరోసా

**ఉద్యోగి చేతికి వచ్చే జీతం ఎంత అన్నదే కాదు.. ఉద్యోగ జీవితం ముగిసిన తర్వాత అతడి భవిష్యత్తు ఎంత భద్రంగా ఉంటుందన్నదీ ముఖ్యమే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపు నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. తప్పనిసరి ఉద్యోగుల భవిష్య నిధి పరిధికి ఉన్న నెలవారీ వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచుతూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం లక్షలాది మంది ఉద్యోగులకు సామాజిక భద్రతను విస్తరించే చర్యగా నిలుస్తోంది.**




ఈ మార్పు 12 ఏళ్ల తర్వాత చోటుచేసుకోవడం మరో విశేషం. ప్రస్తుతం వేతనాలు, జీవన వ్యయం, కుటుంబ అవసరాలు గణనీయంగా పెరిగిన పరిస్థితుల్లో 2014లో నిర్ణయించిన రూ.15 వేల పరిమితి వాస్తవ పరిస్థితులకు దూరమైంది. వేతనం పెరిగినా ఈపీఎఫ్ తప్పనిసరి పరిధిలోకి రాని ఉద్యోగుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో పరిమితిని రూ.25 వేలకు పెంచడం కాలానుగుణ నిర్ణయంగా చెప్పవచ్చు. కేంద్రం అంచనా ప్రకారం కొత్త పరిమితితో మరో 51 లక్షల మందికి తప్పనిసరి ఈపీఎఫ్ సామాజిక భద్రత అందనుంది. ఈ నిర్ణయంలో ప్రధాన ప్రయోజనం ఉద్యోగి భవిష్యత్ పొదుపులోనే ఉంది. నెలనెలా జీతం నుంచి కొంత మొత్తం భవిష్య నిధికి వెళ్తుండటంతో పదవీ విరమణ సమయానికి ఒక ఆర్థిక భరోసా ఏర్పడుతుంది. అంతేకాదు, ఈపీఎఫ్ వ్యవస్థతో అనుసంధానమైన పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాల పరిధి కూడా విస్తరించే అవకాశం ఉంటుంది. అంటే ఉద్యోగి సంపాదిస్తున్న సమయంలోనే కాకుండా, ఉద్యోగానంతర జీవితంలోనూ ఆర్థిక రక్షణకు ఒక వ్యవస్థాగత ఆధారం ఏర్పడుతుంది. అయితే ఈ నిర్ణయాన్ని కేవలం వేతన పరిమితి పెంపుగా చూడకూడదు. దేశంలో సంఘటిత రంగ ఉద్యోగుల సామాజిక భద్రతను విస్తరించే దిశగా దీన్ని చూడాలి. ఆర్థిక వ్యవస్థలో అధికారిక ఉద్యోగాల వాటా పెరుగుతున్న కొద్దీ ఉద్యోగులకు పొదుపు, పెన్షన్, బీమా వంటి రక్షణలు అందుబాటులో ఉండటం అవసరం. ఉద్యోగి సంపాదనలో ఒక భాగం భవిష్యత్తు కోసం క్రమబద్ధంగా పొదుపు కావడం వ్యక్తిగత ఆర్థిక భద్రతకే కాకుండా దేశంలో దీర్ఘకాలిక పొదుపు సంస్కృతికి కూడా దోహదం చేస్తుంది.

అయితే మరో ముఖ్యమైన అంశాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఈపీఎఫ్ పరిధి విస్తరిస్తున్నప్పుడు ఉద్యోగులపై తక్షణ ఆర్థిక భారం ఎంత పడుతుంది? యాజమాన్యాలపై అదనపు వ్యయం ఎలా ఉంటుంది? చిన్న, మధ్య తరహా సంస్థలపై దీని ప్రభావం ఏమిటి? వంటి అంశాల్లో స్పష్టత అవసరం. ఉద్యోగి భవిష్యత్తు భద్రతను పెంచే చర్యతో పాటు ప్రస్తుత ఉద్యోగావకాశాలు, వేతనాలు, సంస్థల స్థిరత్వం కూడా దెబ్బతినకుండా విధాన అమలు ఉండాలి. అదే సమయంలో ఈపీఎఫ్ వ్యవస్థలో పారదర్శకత, వేగవంతమైన సేవలు, ఖాతాల నిర్వహణ, క్లెయిమ్‌ల పరిష్కారం వంటి అంశాలపైనా దృష్టి పెట్టాలి. పరిధిలోకి వచ్చిన ఉద్యోగికి తన ఖాతాలో ఎంత జమ అవుతోంది? యాజమాన్యం ఎంత చెల్లిస్తోంది? పెన్షన్‌కు ఎంత వెళ్తోంది? పదవీ విరమణ సమయంలో ఎంత ప్రయోజనం లభించే అవకాశం ఉంది? వంటి వివరాలు ఉద్యోగికి సులభంగా అర్థమయ్యే విధంగా అందుబాటులో ఉండాలి. సామాజిక భద్రత అనేది కేవలం పదవీ విరమణ తర్వాత అవసరమయ్యే అంశం కాదు. అనుకోని పరిస్థితుల్లో కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించే వ్యవస్థ కూడా కావాలి. అందుకే ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ సామాజిక భద్రతా వ్యవస్థను కూడా అదే స్థాయిలో విస్తరించడం అవసరం. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల జీవితాలను ఎంతగా మార్చుతున్నాయన్నదే వాటి అసలు విలువకు కొలమానం. ఈపీఎఫ్ వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడం ఆ దిశలో ఒక సానుకూల అడుగు. సుమారు 51 లక్షల మంది అదనపు ఉద్యోగులను సామాజిక భద్రతా పరిధిలోకి తీసుకురావడం చిన్న విషయం కాదు. అయితే ఇది ముగింపు కాదు.. సామాజిక భద్రతను మరింత విస్తరించాల్సిన ప్రారంభం. సంఘటిత రంగంతో పాటు అసంఘటిత రంగ కార్మికులు, గిగ్ కార్మికులు, చిన్న ఉద్యోగులు కూడా భవిష్యత్తుపై భరోసాతో జీవించేలా సామాజిక భద్రతా వలయాన్ని విస్తరించాలి. ఉద్యోగి భవిష్యత్తును రక్షించే ప్రతి రూపాయి దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా దీర్ఘకాలిక బలం.



రణధీర్ గుండు
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

**భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ ఒక ప్రత్యేకమైన అధ్యాయం. 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వడ్నగర్‌లో జన్మించిన ఆయన సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి దేశ అత్యున్నత పదవికి ఎదిగారు. 2014లో తొలిసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ, 2019లో రెండోసారి, 2024లో మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మోదీ పాలనా కాలాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. దేశ అభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధితో కాకుండా మౌలిక వసతులు, డిజిటల్ సేవలు, తయారీ రంగం, మహిళా సాధికారత, పేదల సంక్షేమం, అంతర్జాతీయ స్థాయిలో భారత పాత్ర వంటి అనేక అంశాలతో ముడిపెట్టే ప్రయత్నం జరిగింది.**

# భారత్‌కు మరో దిశ.. మోదీ



జనధన్, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, గృహ నిర్మాణం వంటి పథకాలు పెద్ద సంఖ్యలో ప్రజలను లక్ష్యంగా చేసుకున్నాయి. అదే సమయంలో మౌలిక వసతుల అభివృద్ధికి గత దశాబ్దంలో రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, జల సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్‌లపై పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టినట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి నినాదాలను విధానాలుగా మార్చే ప్రయత్నం కూడా మోదీ ప్రభుత్వ పాలనా విధానంలో ప్రధాన భాగంగా నిలిచింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాల ద్వారా పెట్టుబడులు, ఉత్పత్తి, ఉపాధి పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026 మార్చి నాటికి పీఎల్ఐ పథకాల కింద రూ.2.16 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, రూ.20.41 లక్షల కోట్ల ఉత్పత్తి, 14.39 లక్షల ఉద్యోగాల సృష్టి నమోదైనట్లు ప్రభుత్వం తెలిపింది. మోదీ మూడో విడత పాలనలోనూ అభివృద్ధి, సాంకేతికత, తయారీ, మౌలిక వసతులు ప్రధాన ప్రాధాన్యాలుగా కొనసాగుతున్నాయి. 2026లో వ్యవసాయ మౌలిక వసతుల నిధి రుణ లక్ష్యాన్ని రూ.2 లక్షల కోట్లకు పెంచడం, 'లఖ్‌పతి దీదీ' లక్ష్యాన్ని 6 కోట్లకు పెంచడం, ప్రారంభ సంస్థల కోసం రూ.10 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలను కేంద్రం ప్రకటించింది. మొబైల్ ఫోన్ తయారీని మరింత విస్తరించేందుకు రూ.62,500 కోట్ల పథకానికీ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అయితే ఒక నాయకుడి పాలనా ప్రస్థానాన్ని కేవలం విజయాల జాబితాతోనే కొలవలేం. ఆర్థిక అవకాశాలు అందరికీ సమానంగా అందుతున్నాయా? ఉపాధి అవకాశాలు ఆశించిన స్థాయిలో పెరుగుతున్నాయా? రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తున్నాయా? కేంద్ర-రాష్ట్ర సంబంధాలు మరింత సమతుల్యంగా సాగుతున్నాయా? ప్రజాస్వామ్య సంస్థలు, పార్లమెంటరీ చర్చలు, పత్రికా స్వేచ్ఛ వంటి అంశాల్లో ప్రజల ఆందోళనలకు ప్రభుత్వం ఎలా స్పందిస్తోంది? అనే ప్రశ్నలూ అంతే ముఖ్యమైనవి. అభివృద్ధి అంటే కేవలం భారీ ప్రాజెక్టులు కాదు. చివరి వరుసలో ఉన్న పౌరుడి జీవన ప్రమాణం మెరుగుపడటం కూడా అభివృద్ధే. జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెరగడం ఎంత ముఖ్యమో, గ్రామీణ కుటుంబానికి నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, భద్రత అందడం కూడా అంతే ముఖ్యం. అందుకే మోదీ నాయకత్వం తదుపరి దశలో సాధించిన లక్ష్యాల కంటే వాటి ఫలితాలు ప్రజల జీవితాల్లో ఎంత లోతుగా ప్రతిబింబిస్తున్నాయన్నదే అసలు కొలమానం కావాలి. 76వ జన్మదినం మోదీ వ్యక్తిగత జీవితంలో మరో మైలురాయి. కానీ దేశ ప్రధానమంత్రిగా ఆయన ముందున్న అసలు సవాలు వయసు కాదు.. భారతదేశం నిర్దేశించుకున్న భవిష్యత్తు లక్ష్యాలను ఆచరణలోకి తీసుకురావడం. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న నేపథ్యంలో ఆర్థిక ప్రగతితో పాటు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంస్థాగత బలోపేతం, సమాఖ్య స్ఫూర్తి కూడా సమానంగా ముందుకు సాగాలి. 2026 బడ్జెట్ సందర్భంలోనూ 'వికసిత్ భారత్-2047' లక్ష్యాన్ని ప్రభుత్వం తన ప్రధాన దిశగా పేర్కొంది. నరేంద్ర మోదీ రాజకీయ ప్రయాణం భారత ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎంత ప్రభావాన్ని చూపగలదో తెలిపే ఉదాహరణ.

అభిషేక్ కురుమ,
బజరంగ్ దళ్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.